సాక్షి
తిరుపతి
శనివారం । 1 । జూన్ । 2024



ఘాట్‌లో జీపు బోల్తా

తిరుమల రెండో ఘాట్ రోడ్డులో ఓ జీపు అదుపు తప్పి బోల్తా పడింది. నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. - IIలో



ఉద్యోగ విరమణ

తిరుపతి జిల్లా వ్యాప్తంగా 11 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. - IIలో



సాగుకు సన్నద్ధం

జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ సాగుకు రైతులు సిద్ధమయ్యారు. దుక్కిలు దున్ని, నాట్లు వేసేందుకు సమాయత్తమయ్యారు. - IIలో

నీళ్లన్నీ ఎండి.. ఉప్పుతో నిండి!

చినుకు కునుకేసింది. కరువు తాండవిస్తోంది. దీనికితోడు సముద్ర ముఖద్వారాలు ఇసుక మేటలతో పూడిపోవడంతో పులికాట్ సరస్సు ఉత్తరం వైపు పూర్తిగా ఎండిపోయింది. ఎటు చూసినా తెల్లటి ఉప్పుతో నిండిపోయింది. శ్వేత వర్ణంలో పర్యాటకులను ఆకట్టుకుంటోంది. స్థానికులకు కావాల్సినంత స్వచ్ఛమైన ఉప్పు లభ్యమవుతోంది.



సూళ్లూరుపేట-శ్రీహరికోట మార్గంలో తెల్లగా ఉప్పుతో కప్పబడిన పులికాట్ సరస్సు

- ఉప్పుతో నిండిపోయిన పులికాట్ సరస్సు
- శ్వేత వర్ణంలో ఆకట్టుకుంటున్న వైనం
- ఓ వైపు క్షామం.. మరో వైపు సముద్ర జలాలు రాకపోవడమే కారణం





సూళ్లూరుపేట: ప్రపంచంలోనే రెండో అతిపెద్ద సరస్సు పులికాట్ సరస్సు. కరువు కాటకాలు, ముఖద్వారాల పూడికతో నీళ్లు రాక ఉప్పుతో నిండిపోయింది. సరస్సు మొత్తం తెల్లగా శ్వేతవర్ణంలో మారిపోయింది. సూళ్లూరుపేట-శ్రీహరికోటకు వెళ్లే రోడ్డులో ఈ సరస్సును చూస్తే ఇదే తేటతెల్లమవుతోంది. గత ఏడాది వరదలొచ్చి పులికాట్ సరస్సుకు తగినంతగా నీళ్లు చేరినప్పటికీ ఫిబ్రవరి నుంచి వర్షపు జాడ లేకపోవడంతో క్రమేణా నీళ్లు తగ్గిపోతూ ఎడారిలా మారింది. సముద్ర ముఖద్వారాల నుంచి నీళ్లు పలచగా రావడం, అవి కూడా ఎండిపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. శ్రీహరికోట రోడ్డుకు దక్షిణం వైపు సరస్సు లోతుగా ఉండడం, తమిళనాడులోని పల్‌వేరికాడ్ ముఖద్వారం నుంచి నీళ్లు రావడంతో అక్కడ మాత్రం నీళ్లున్నాయి. ఉత్తరం వైపు రాయదొరువు ముఖద్వారం నుంచి నీళ్లు రాకుండా ఆగిపోవడంతో సరస్సు ఎడారిలా మారింది. అయితే వేసవిలో ఇలా ఉప్పుతో కప్పబడి ఉండడంతో ఈ ప్రాంతంలోని పులికాట్ సరస్సును ఉప్పు కయ్యలు అని పిలుస్తుంటారు. వేసవిలో ఇలా సహజసిద్ధంగా ఏర్పడిన ఉప్పును తీరప్రాంత గ్రామాల ప్రజలు తీసుకెళ్లి వాడుకుంటుంటారు. ఇలా పండిన ఉప్పుతో స్వచ్ఛంగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. శ్రీహరికోటకు వెళ్లే వాళ్లేకాకుండా సరస్సును చూడడానికి వచ్చే పర్యాటకులు సరస్సు అందాలను తమ కెమెరాల్లో బంధిస్తున్నారు. విదేశీ విహంగాల వేదిక ఎండిపోవడంతో ఆవేదనకు లోనవుతున్నారు.

సత్యవేడుదే తొలి ఫలితం

వరదయ్యపాళెం: సార్వత్రిక ఎన్నికల ఫలితాలకు సంబంధించి జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపు ప్రక్రియలో సత్యవేడు అసెంబ్లీ నియోజకవర్గందే తొలి ఫలితం వెలువడనుంది. మే 13న జరిగిన ఎన్నికల పోలింగ్‌లో నియోజకవర్గానికి సంబంధించి 279 పోలింగ్ కేంద్రాలలో 1,83,686 ఓట్లు పోలయ్యాయి. దీనికి సంబంధించి ఎన్నికల లెక్కింపు ప్రక్రియలో 20 రౌండ్ల ద్వారా తుది ఫలితం వెలువడనుంది. ఆ దిశగా ఓట్ల లెక్కింపునకు అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. జిల్లాలోని 7 నియోజకవర్గాలలో సత్యవేడు నియోజకవర్గానికి సంబంధించి 20 రౌండ్ల లెక్కింపు కలిగిన నియోజకవర్గం కాబట్టి తొలి ఫలితం తేలనుంది.

బెట్టింగుల జోరు

ఎన్నికల ఫలితాలపై వైఎస్సార్‌సీపీ, టీడీపీ నాయకుల మధ్య బెట్టింగుల జోరు కొసాగుతోంది. నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీదే విజయం అంటూ నియోజకవర్గ కేంద్రమైన సత్యవేడులో రూ.50 లక్షలకు పైగా బెట్టింగులు పెట్టినట్లు సమాచారం. అయితే ప్రధానంగా అసెంబ్లీ నియోజకవర్గం కంటే కూడా రాష్ట్ర స్థాయిలో అధికారం తమదంటే తమదేనని రెండు ప్రధాన పార్టీల మధ్య బెట్టింగుల జోరు కొనసాగుతోంది. ఏది ఏమైనప్పటికీ మరో మూడు రోజుల్లో ఈ ఉత్కంఠకు తెరపడనుంది.

న్యూస్‌రీల్

బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారిగా చంద్రశేఖర్

తిరుపతి అర్బన్: బీసీ వెల్ఫేర్ జిల్లా ఇన్‌చార్జ్ అధికారిగా చంద్రశేఖర్ శుక్రవారం నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన శనివారం బాధ్యతలు స్వీకరించనున్నారు. జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి భాస్కర్‌రెడ్డి శుక్రవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ క్రమంలో శ్రీకాళహస్తి బీసీ వెల్ఫేర్ జిల్లా అసిస్టెంట్ అధికారిగా పనిచేస్తున్న చంద్రశేఖర్‌కు ఇన్‌చార్జ్ జిల్లా అధికారిగా నియమితులయ్యారు.

బ్యాంకుల ద్వారానే పింఛన్లు

తిరుపతి అర్బన్: ఈ సారీ సామాజిక భద్రతా పింఛన్లు బ్యాంక్‌ల ద్వారానే పంపిణీ చేయనున్నారు. నడవలేని వారు, 80 ఏళ్లు పైబడిన వారికి మాత్రమే ఇళ్ల వద్ద పంపిణీ చేసే ఏర్పాట్లు చేపట్టారు. జిల్లాలో 2,69,684 మంది పింఛన్‌దారులుండగా.. వారికి రూ.80.25 కోట్లు పంపిణీ చేయనున్నట్టు సబంధిత అధికారులు తెలిపారు. బ్యాంక్ అకౌంట్ ఉన్న 1,95,865 మందికి డీబీటీ ద్వారా వారి ఖతాల్లో రూ.58.75 కోట్లు జమ చేయనున్నట్టు వెల్లడించారు. మరోవైపు బ్యాంక్ అకౌంట్లు పనిచేయని వారికి, 80 ఏళ్లు దాటిన వృద్ధులు 73,819 మందికి రూ.21.48 కోట్లు సచివాలయ ఉద్యోగులు వారి ఇంటివద్దకే వెళ్లి పింఛన్లు ఇవ్వనున్నారు. ఆ మేరకు చర్యలు చేపట్టాలని డీఆర్‌డీఏ అధికారులను ఇప్పటికే కలెక్టర్ ఆదేశించారు.

క్షణక్షణం.. అప్రమత్తం



కౌంటింగ్ కేంద్రం వద్ద పోలీసుల నిఘా

తిరుపతి అర్బన్: ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో జిల్లాలో పటిష్ట భద్రతా చర్యలు చేపడుతున్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రవీణ్ కుమార్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు నేతృత్వంలో కౌంటింగ్ కేంద్రమైన తిరుపతి శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంతోపాటు సమీప ప్రాంతాలపైనా నిఘా పెట్టారు. ఇప్పటికే 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలు చేస్తున్నారు. ఇది జూన్ 6వ తేదీ వరకు అమలులో ఉంటుందని స్పష్టం చేశారు. ఎన్నికల ఫలితాల ముందు, తరువాత గ్రామాలు, పట్టణాల్లో విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు, బహిరంగ సభలకు ఎలాంటి అనుమతులు లేవని అధికారులు హెచ్చరికలు జారీచేశారు. ప్రజలను రెచ్చగొట్టేలా రాజకీయనాయకుల సందేశాలు, ప్రసంగాలు, నిరాధార ఆరోపణలు, రచ్చబండ చర్చలు, సోషల్ మీడియాలో ప్రచారం మొదలైన వాటిని నేరంగా పరిగణిస్తామని స్పష్టం చేశారు. పెట్రోల్ బంకుల్లో బాటిళ్లకు, క్యాన్లకు డీజిల్, పెట్రోల్ విక్రయించరాదని సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. బాణసంచా విక్రయాలపైనా ఆంక్షలు విధించారు. జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో సారా, మద్యం విక్రయాలు, రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు



తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ బాట గంగమ్మ ఆలయం వద్దకు చేరింది. గురువారం అర్ధరాత్రి వరకు 64,115 మంది స్వామిని దర్శించుకున్నారు. 32,711 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.23 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన వారికి సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన వారు 2 గంటల్లో స్వామిని దర్శించుకుంటున్నారు.

12 నుంచి డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

తిరుపతి సిటీ : ఎస్వీయూ పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఈ నెల 12వ తేదీ నుంచి డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు నిర్వహించనున్నట్టు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ దామ్లానాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానంగా డిగ్రీ మొదటి సంవత్సరం రెండో సెమిస్టర్, సెకండ్ ఇయర్ నాలుగో సెమిస్టర్ పరీక్షలను 12వ తేదీ నుంచి జులై 2వ తేదీ వరకు జరుగుతాయని పేర్కొన్నారు. అన్ని డిగ్రీ కళాశాలల్లో ఒక్కో సెమిస్టర్‌కు సుమారు 22 వేల మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు వెల్లడించారు. పరీక్షల షెడ్యూల్‌ను ఇప్పటికే అన్ని కళాశాలల ప్రిన్సిపాళ్లకు పంపించామని తెలిపారు. గతంలో నిర్దేశించిన పరీక్షా కేంద్రాల్లోనే పరీక్షలు జరుగుతాయని, ఇందులో మార్పు లేదని పేర్కొన్నారు.

కౌంటింగ్‌పై డేగ కన్ను



మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

- పోలీసులు, అదనపు బలగాలతో భద్రత
- తిరుపతిలో 144 సెక్షన్, పోలీస్ 30 యాక్ట్ అమలు
- అభ్యర్థులు, ఏజెంట్లు, సిబ్బందికి ప్రత్యేక పార్కింగ్
- చంద్రగిరి నియోజకవర్గంలో పటిష్ట భద్రత
- ప్రతి అభ్యర్థికీ ఎస్కార్ట్ పైలెట్
- విలేకరుల సమావేశంలో ఎస్పీ హర్షవర్ధన్ రాజు

తిరుపతి క్రైమ్: జిల్లాలో ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో పటిష్ట భద్రతా చర్యలు చేపట్టినట్టు జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. శుక్రవారం పోలీస్ గెస్ట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల అనంతరం జరిగిన గొడవలను దృష్టిలో ఉంచుకొని, కౌంటింగ్ రోజున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట భద్రత ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్ జరిగే మహిళా యూనివర్సిటీ వద్ద ఇప్పటికే మూడంచల భద్రత ఉందన్నారు. కౌంటింగ్ కేంద్రం, ఇన్నర్ కార్డెన్, ఔటర్ కార్డల వద్ద 25 చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి ఎంట్రీ, ఎగ్జిట్ గేట్ల వద్ద నిరంతరం 250 మంది సాహిదా బలగాలతో తనిఖీలు చేస్తున్నట్టు వెల్లడించారు. నిరంతరం సీసీ కెమెరాల ద్వారా కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి ప్రతి ఒక్కటీ పర్యవేక్షిస్తున్నట్టు పేర్కొన్నారు.

జిల్లాకు ప్రత్యేక బలగాలు

కౌంటింగ్ రోజు పోలీసులతో పటిష్ట భద్రత నిర్వహిస్తున్నామని ఎస్పీ తెలిపారు. ఇందులో ఇద్దరు ఎస్పీలు, ఏఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుల్, పీసీలు, మరో మూడు అదనపు బలగాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అంతేకాకుండా 142 మంది అత్యవసర ఆదరణకు బలగాలు జిల్లా హెడ్ క్వార్టర్ వద్ద అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. కౌంటింగ్ కేంద్రంలోకి వెళ్లే వారు ఎవరైనా మద్యం సేవించారా..? అని గుర్తించేందుకు ప్రత్యేకంగా బ్రీత్ అనలైజర్‌తో తనిఖీ చేస్తామన్నారు.

నో ఫ్లయింగ్ జోన్‌గా శ్రీపద్మావతి

కౌంటింగ్ కేంద్రం చుట్టూ నో ఫ్లయింగ్ జోన్, రెడ్ జోన్‌గా ప్రకటించినట్టు ఎస్పీ వెల్లడించారు. ఇక్కడ డ్రోన్ కెమెరాలు ఎగురవేయడం నిషేధమన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మూడు కిలోమీటర్ల వరకు పోలీసుల ఆధీనంలో ఉంటుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 73 మొబైల్ పార్టీలు, 53 ఎస్కార్ట్ టీములను ఏర్పాటు చేసినట్టు ఆయన పేర్కొన్నారు.

అభ్యర్థులకు కట్టుదిట్టమైన భద్రత

ఎన్నికల్లో పోటీ చేసే ప్రతి అభ్యర్థికీ కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థి ప్రయాణించే వాహనానికి ముందు పైలట్ వాహనము, వెనకాల ఎస్కార్ట్ వాహనం, షాడో పార్టీలను ఏర్పాటు చేస్తామన్నారు. వారు తిరిగి మళ్లీ ఇంటికి వెళ్లే వరకు కూడా ఈ భద్రత కొనసాగుతుందని స్పష్టం చేశారు. స్పెషల్ ఆఫీసర్ ఎస్పీ సరిత, ఏఎస్పీలు కులశేఖర్,వెంకటరావు, విమలకుమారి పాల్గొన్నారు.

విజయోత్సవ ర్యాలీలకు అనుమతిలేదు

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఎలాంటి విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద, కౌంటింగ్ కేంద్రానికి వెళ్లే దారులవెంట సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేశామని, ప్రతి వ్యక్తి కదలికలు, సీసీ కెమెరాలు రికార్డు చేస్తాయన్నారు. కౌంటింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్లు తీసుకెళ్లరాదన్నారు. సాధ్యమైనంత వరకు సెల్ ఫోన్ తీసుకురాకపోవడమే మంచిదని సూచించారు. జూన్ 6వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటాయన్నారు. ఎవరైనా బయటి వ్యక్తులకు, గుర్తుతెలియని వ్యక్తులకు, పాత నేరగాళ్లకు ఆశ్రయమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

చంద్రగిరిపై ఫోకస్

చంద్రగిరిలో సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ఇప్పటికే ఏఎస్పీ స్థాయి అధికారితో పాటు 250 మంది సిబ్బందితో భద్రతా చర్యలు చేపట్టినట్టు ఎస్పీ వెల్లడించారు. కౌంటింగ్ రోజున మరింత భద్రతను పెంచి ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

కౌంటింగ్ కేంద్రానికి ప్రత్యేక మార్గాలు

- చంద్రగిరి, వెంకటగిరి, శ్రీకాళహస్తి, గూడూరు, సూళ్లూరుపేట, సత్యవేడు నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు, జనరల్ ఏజెంట్లు, ఆర్వోలు, ఏఆర్వోలు, పరిశీలకులు నేషనల్ హైవే 205 రామానుజపల్లి చెక్ పోస్ట్ మీదుగా తుమ్మలగుంట క్రాస్, పద్మావతి మహిళా యూనివర్సిటీ గేట్ నం.2 గుండా లోనికి ప్రవేశించాలి. వీరి వాహనాలు మహిళా యూనివర్సిటీ లోపల వారికి కేటాయించిన పార్కింగ్ స్థలాల వద్ద పార్క్ చేయాలి. అదేవిధంగా కౌంటింగ్ ఏజెంట్లు నేషనల్ హైవేలోని ఆర్సీపురం జంక్షన్ నుంచి ఎంఆర్ పల్లి పై కొత్తగా ఏర్పడిన పొంగులేటి సీతమ్మ రోడ్ ఎంట్రీ పాయింట్‌కి చేరుకొని నిర్దేశించిన ప్రాంతాల్లో పార్కింగ్ చేసుకోవాలన్నారు. అనంతరం గేట్-1 ద్వారా నడక మార్గంలో కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలన్నారు.



పార్కింగ్ ప్రదేశాలు ఇలా..

- అభ్యర్థులు, జనరల్ ఏజెంట్లు, ఆర్వోలు, ఏర్వోల వాహనాలన్నీ కూడా తిరుపతి మహిళా యూనివర్సిటీలో కేటాయించిన పార్కింగ్ స్థలాల్లో పార్కింగ్ చేయాలి.
- డీఎస్పీ స్థాయి వరకు పోలీస్ సిబ్బంది, ఎమ్మా ర్వో స్థాయి వరకు రెవెన్యూ అధికారులు, కౌంటింగ్ ఏజెంట్లు పోలీస్ సిబ్బంది, పొంగులేటి సీతమ్మ రోడ్డులో వారికి కేటాయించిన స్థలంలో వాహనాలు పార్కింగ్ చేయాలి.
- తిరుపతి అసెంబ్లీ నుంచి పోటీ చేసే అభ్యర్థు లు, జనరల్ ఏజెంట్లు, ఆర్వోలు, ఏఆర్వోలు, పరిశీలకులు వెంగమాంబ సర్కిల్, రాళ్లపల్లి విగ్రహం, పద్మావతి మహిళా యూనివర్సిటీ గెట్-2 ద్వారా కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలి. అక్కడ వారికి కాటాయించిన స్థలంలో వాహనాలు పార్కింగ్ చేసుకోవాలన్నారు. కౌంటింగ్, ఏజెంట్లు, కౌంటింగ్ సిబ్బంది ఎంఆర్ పల్లి సర్కిల్ మీదుగా పొంగులేటి సీతమ్మ రోడ్డు ఎంట్రీ పాయింట్ వద్దకు చేరుకొని వారికి కేటాయించిన ప్రాంతాల్లో వాహనాలు పార్కింగ్ చేసి, గేట్ నం.1 ద్వారా కౌంటింగ్ కేంద్రానికి వెళ్లాలి.

ఫైడే!



- ఉడుకుతున్న జిల్లా
- శ్రీకాళహస్తిలో అత్యధికంగా 42.6 డిగ్రీలు

తిరుపతి అర్బన్: జిల్లాలోని ప్రజలు ఉక్కపోత, వేసవి తాపంతో అల్లాడిపోతున్నారు. రోజువారీ కూలీలు, రైతులు, కార్మికులు ముప్పుతిప్పలు ఎదుర్కొంటున్నారు. ఉదయం 7 గంటల నుంచే సూరీడు నిప్పుల వాన కురిపించడంతో తల్లడిల్లిపోతున్నారు. చిన్నారులు, పురిటి బిడ్డలు గుక్కపట్టేస్తున్నారు. ఉపాధి కూలీల పరిస్థితి మరీ అధ్వానంగా ఉంటోంది. వృద్ధులు వేసవి తాపాన్ని తట్టుకోలేక తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. పొద్దుపోయిన తర్వాత కూడా ఉక్కపోత తగ్గకపోవడంతో కొందరు నీరసించి పడిపోతున్నారు. అర్ధరాత్రి వరకు ఉక్కపోతతో చెమటలు కార్చుకుంటూ జాగారం చేస్తున్నారు. ఫ్యాన్లు తిరుగుతున్నా.. ఏసీలు పనిచేస్తున్నా ఉపశమనం కలగడంలేదని పలువురు ఆవేదన చెందుతున్నారు. ఈ క్రమంలో చల్లని పానియాలవైపు మొగ్గు చూపుతున్నారు. శుక్రవారం జిల్లా సగటు ఉష్ణోగ్రత 41.5 డిగ్రీలు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. అత్యధికంగా శ్రీకాళహస్తిలో 42.6 డిగ్రీలు, అత్యల్పంగా సత్యవేడులో 38.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు చోటుచేసుకున్నట్టు పేర్కొన్నారు. మరో నాలుగైదు రోజులు ఇదే పరిస్థితులు ఉండవచ్చని అంచనా వేస్తున్నారు.

శుక్రవారం జిల్లాలో నమోదైన ఉష్ణోగ్రతలు

గరిష్ఠ ఉష్ణోగ్రత (డిగ్రీ/సెల్సియస్‌లో)

శ్రీకాళహస్తి 42.6	తిరుపతి 42
గూడూరు 42.4	వెంకటగిరి 42.1
చంద్రగిరి 39.5	సూళ్లూరుపేట 38.6
సత్యవేడు 38.3	







తిరుపతిలో ఎండ వేడిమికి తట్టుకోలేక ఇలా..

క్లుప్తంగా

ఈసెట్ ఫలితాల్లో ఎస్వీజీపీ విద్యార్థుల ప్రతిభ


కే.త్రివేణి, రాష్ట్ర స్థాయి మొదటి ర్యాంకు


బీ.హేమనాథరెడ్డి, రాష్ట్ర స్థాయి మొదటి ర్యాంక్

తిరుపతి ఎడ్యుకేషన్ : పాలిసెట్ విద్యార్హతతో ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశానికి నిర్వహించిన ఏపీ ఈసెట్–2024 పరీక్షా ఫలితాల్లో తిరుపతి కేటీ రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి మొదటి ర్యాంకుతో పాటు ఉత్తమ ర్యాంకులు సాధించారు. ఈ ఫలితాల్లో ఫార్మసీ, ఎలక్ట్రానిక్స్ విభాగాల్లో కే.త్రివేణి, బీ.హేమనాథరెడ్డి రాష్ట్ర స్థాయి మొదటి ర్యాంకులు సాధించారు. అలాగే ఫార్మసీ విభాగంలో జే.సోమశేఖర్ 4, ఎస్.విష్ణు 7, ఎం.జీవ 14, ఎలక్ట్రానిక్స్ విభాగంలో సీ.వెంకటగణేష్ 6, పృథ్వితనుష్ 20, సివిల్ విభాగంలో ఎం.వివేకానందరెడ్డి 13, ఎస్.చరణ్ కుమార్ 23, టీ.కపిల్ 30, మెకానికల్‌లో ఏ.జయసింహ 78, సీ.సాయిచంద్ర 111, సీఎం.చందు 160, ఎలక్ట్రికల్ విభాగంలో ఎస్.సాయిగిరినాథ్‌రెడ్డి 13, పీ.చేతన్ ఆనంద్ 20, ఎల్.యువకృష్ణ 38, సీ.నిర్మల్‌కుమార్ 41వ ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి, జనరల్ సెక్షన్ విభాగాధిపతి డాక్టర్ ఎస్వీ.గౌరీశంకర్, ఇతర విభాగాధిపతులు, అధ్యాపకులు అభినందించారు.

అటవీ ప్రాంతంలో అగ్నిప్రమాదం


మంటలార్పుతున్న టాస్క్‌ఫోర్సు అధికారులు, అగ్నిమాపక సిబ్బంది

తిరుపతి కల్చరల్: ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక టాస్క్ ఫోర్సు కార్యాలయం వెనుకవైపు ఉన్న అటవీ ప్రాంతంలో శుక్రవారం సాయంత్రం 5.30 టగంటలకు అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. అక్కడి చెట్లు కాలిపోయాయి. దీంతో అప్రమత్తమైన టాస్క్‌ఫోర్సు సిబ్బంది ఎస్పీ శ్రీనివాస్‌కు సమాచారం అందజేశారు. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను పూర్తిగా ఆర్పివేశారు. దీంతో ఆస్తి, ప్రాణనష్టాలు జరగలేదని టాస్క్‌ఫోర్సు అధికారులు తెలిపారు. ఆకస్మాత్తుగా మంటలు చెలరేగడానికి కారణాలపై విచారణ చేపట్టారు.

సాగుకు సన్నద్ధం

- ఖరీఫ్‌లో 50 వేల ఎకరాల్లో సాగు
- రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు
- అందుబాటులో 1,200 క్వింటాళ్ల వరి విత్తనాలు


వరి నారు పెరుగుతున్న కూలీలు (ఇన్‌సెట్) ప్రసాద్‌రావు, డీఏఓ



తిరుపతి అర్బన్: జిల్లాలో రైతులు సాగుకు సమాయత్తమవుతున్నారు. ఖరీఫ్‌లో మొత్తం 50వేల ఎకరాల్లో సాగుచేసేందుకు సన్నద్ధమయ్యారు. ఇప్పటికే దుక్కులు దున్నడం లాంటి పనులను ముమ్మరం చేశారు. ఈ సీజన్‌లో ప్రధానంగా వరి, వేరుశనగ, సజ్జ పంటలను సాగుచేస్తున్నారు. ఇప్పటికే 7వేల ఎకరాల్లో వరి, 2 వేల ఎకరాల్లో వేరుశనగ, వెయ్యి ఎకరాల్లో సజ్జ పంట సాగుచేశారు. మరో నెల రోజుల్లో వంద శాతం పంటలు సాగుచేయనున్నట్టు అధికారులు తెలిపారు. ఈ మేరకు రైతులకు అవసరమైన యూరియా, డీఏపీ, పాస్పెట్ తదితర ఎరువులను అధికారులు సచివాలయాల్లో సిద్ధంగా ఉంచారు.

రైతులకు రాయితీ విత్తనాలు

రైతులకు అవసరమైన మేరకు రాయితీ విత్తనాలను పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో భూములను సారవంతం చేయడానికి 13,938 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధం చేసుకున్నారు. ఇందులో జీలగలు 10,113 క్వింటాళ్లు, జనుములు 2,118 క్వింటాళ్లు, పిల్లిపెసర 1,707 క్వింటాళ్లు అందుబాటులో ఉంచారు. వీటిని 50 శాతం రాయితీతో రైతులకు అందించనున్నారు. మరోవైపు 3,362 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలను అందించనున్నారు. వీటికి 40 శాతం రాయితీ కల్పించనున్నారు. అంతేకాకుండా బీపీటీలు 1020 క్వింటాళ్లు, ఎస్ఎల్ఆర్ 3449 రకం 180 క్వింటాళ్ల వరి విత్తనాలను అందించడానికి సిద్ధంగా ఉన్నట్టు సంబంధిత అధికారులు తెలిపారు. ఈ మేరకు వాటిని రైతు భరోసా కేంద్రాల్లో నిల్వ ఉంచినట్టు పేర్కొన్నారు. క్వింటాకు రూ.500 రాయితీ వర్తిస్తుందని చెబుతున్నారు.

జూన్ 4 నుంచి పంటలపై అవగాహన

జూన్ 4వ తేదీ నుంచి పంటల సాగుపై పీఎం ప్రణమ్ పేరుతో పెద్ద ఎత్తున రైతులకు అవగాహన కల్పించనున్నారు. ప్రధానంగా రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించడం, సేంద్రియ ఎరువులను పెంచడం, ప్రకృతి వ్యవసాయం ద్వా రా కలిగే ఆరోగ్య ఫలితాలను తెలియజేయడం, మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలపై అవగాహన కల్పించడం, దళారుల చేతిలో మోసపోకుండా తమ పంటలను తామే ఎలా విక్రయించుకోవాలో తెలియడం తదితర వాటిపై అవగాహన కల్పించనున్నారు.

సమర్థవంతంగా అగ్రిల్యాబ్‌లు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇప్పటికే ఒక్కో నియోజకవర్గానికి ఒక్కో అగ్రిల్యాబ్‌లను ఏర్పాటు చేసింది. వీటిని రైతులు వినియోగించుకోవడానికి చకచకా చర్యలు చేపడుతున్నారు. ప్రధానంగా మంచి దిగుబడికి నాణ్యమైన విత్తనాలు సాగుచేయాల్సి ఉంది. ఈ క్రమంలో రైతులు వాడే విత్తనాల నాణ్యతను ఈ ల్యాబ్‌ల ద్వారా పరీక్షించనున్నారు. రైతులు ఒకే రకమైన పంటలను సాగుచేయకుండా భూసార పరీక్షలను చేపట్టి పంటమార్పిడి పద్ధలను అలవాటు చేయనున్నారు.


తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.74,350
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.6,659

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.95,500
రిటైల్ వెండి గ్రాము	రూ.97.50

గుంతలో పడి యువకుడి మృతి

చిల్లకూరు: ఓ యువకుడు బహిర్భూమి నిమిత్తం వెళ్లి కాళ్లు కడుక్కునే సమయంలో ప్రమాద వశాత్తు గుంతలో పడి మృతిచెందాడు. పోలీసుల వివరాల మేరకు.. అల్లీపురానికి చెందిన మనోజ్ (26) ట్రాక్టర్ డ్రైవర్. ఈ క్రమంలో గురువారం సాయంత్రం బహిర్భూమికని గ్రామానికి తూర్పు వైపున ఉన్న సిలికా భూముల్లోకి వెళ్లాడు. అక్కడ నీటిలోకి దిగుతుండగా ప్రమాదవశాత్తు కలుజారి గుంతలో పడి మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

దాడిచేసి తప్పుడు ఫిర్యాదులా?

తిరుపతి లీగల్ : తిరుపతి శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీ సమీపంలో మే 14వ తేదీ మధ్యాహ్నం టీడీపీ కార్యకర్తలు పోలీసు అధికారులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, ఇతర ప్రజలపై దాడులు చేసిందేగాక వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారంటూ చంద్రగిరి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని తప్పుడు ఫిర్యాదు చేశారంటూ తిరుపతి పదవ అదనపు జిల్లా జడ్జి కోర్టులో మహిళ న్యాయవాది వాణి వాదనలు వినిపించారు. వివరాల్లోకి వెళ్తే.. శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీ సమీపంలో తనపై 38 మంది వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు హత్యాయత్నానికి పాల్పడ్డారంటూ నాని ఫిర్యాదుపై ఎస్వీ యూనివర్సిటీ పోలీసులు 10 మంది వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. దీనిపై వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు స్థానిక పదవ అదనపు జిల్లా జడ్జి కోర్టులో బెయిల్ పిటిషన్లు దాఖలు చేసుకున్నారు. ఆ పిటిషన్‌లపై శుక్రవారం వాదనలు జరిగాయి. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు తరఫున మహిళా న్యాయవాది ఎం.వాణి వాదనలు వినిపిస్తూ ఎన్నికల రోజు, ఆ మరుసటి రోజు టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మోహిత్‌రెడ్డితో పాటు ఇతర కార్యకర్తలపై మారణాయుధాయలతో దాడి చేశారన్నారు. కొట్టాల చంద్రశేఖర్‌రెడ్డి ఇంటిని టీడీపీ అభ్యర్థి నాని, అతని కుమారుడు, అతని అనుచరులు తగులబెట్టారన్నారు. అలాగే మహిళా యూనివర్సిటీ సమీపంలో టీడీపీ అభ్యర్థి నాని స్ట్రాంగ్ రూం వద్దకు వెళ్లాక అతని గన్‌మెన్ రెండు సార్లు కాల్పులు జరిపారన్నారు. అతనిపై ఎటువంటి చిన్న రక్తపు మరక లేకపోయినా హత్యాయత్నానికి పాల్పడినట్టు ఫిర్యాదు చేయడం, ఆ ఫిర్యాదు పై పోలీసులు కేసు నమోదు చేయడం ఆశ్చర్యకరమన్నారు. టీడీపీ అభ్యర్థి నాని భార్య సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేయడం వల్ల టీడీపీ కార్యకర్తలు మహిళా యూనివర్సిటీ వద్దకు చేరి పోలీస్ అధికారితో పాటు ఇతర ప్రజలపై దాడులు చేశారన్నారు. టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యకర్తలపై చేసిన దాడి, ఆ దాడికి ముందు సేకరించిన మారణాయుధాలు ఇతర వివరాల వీడియోలను న్యాయవాది కోర్టుకు సమర్పించారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ కోటేశ్వర్ రెడ్డి వాదనలు వినిపించారు. అలాగే బెయిల్ పిటిషన్‌లో ఇంప్లీడ్ అయినా పులివర్తి నాని తరపు చిత్తూరు న్యాయవాది వాదించారు. జూన్ మూడో తేదీన న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేయడానికి వాయిదా వేశారు. బెయిల్ పిటిషన్‌లపై వాదనలు ఉండడంతో పోలీసులు కోర్టుల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు.

మామిడి తోటలో మదపటేనుగు

రేణిగుంట: మండలంలోని మామండూరు గ్రామ శివారులో ఉన్న మామిడి తోటల్లోకి శుక్రవారం సాయంత్రం మదపటేనుగు వచ్చి ఘీంకార శబ్దాలతో చెట్టు కొమ్మలు విరిచి బీభత్స సృష్టించింది. మామిడి తోటలు కాపుకు రావడంతో రైతులు తోటలోనే రాత్రింబవళ్లు కాపలా ఉంటున్నారు. అయితే శుక్రవారం సాయంత్రం శేషాచలం అటవీ ప్రాంతం నుంచి ఓ పెద్ద ఏనుగు మామిడి తోటలోకి ప్రవేశించింది. అక్కడున్న కాపరులు కేకలు వేయడంతో వారివైపు తొండం ఊపుతూ దాడి చేసేందుకు పరుగులు తీసింది. ఏనుగు వెంబడించడంతో అక్కడున్న వారు పరుగులు తీస్తూ గ్రామానికి చేరుకున్నారు. రైతులు విషయాన్ని అటవీశాఖ సిబ్బందికి తెలియజేశారు. గత నెల మొదటి వారంలో ఒకసారి ఇలాగే శేషాచలం అడవుల్లో నుంచి ఏనుగుల గుంపు మామండూరు మామిడి తోటల్లోకి వచ్చినట్టు రైతులు తెలిపారు. రాత్రికి మరిన్ని ఏనుగులు వస్తాయని ఆందోళన చెందుతున్నారు. ఫారెస్ట్ అధికారులు చేరుకుని బాణసంచా కాల్చి ఏనుగును అడవిలోకి తరమాలని రైతులు కోరుతున్నారు. ప్రభుత్వం నష్టపరిహారం అందజేయాలని వేడుకుంటున్నారు.

ఘాట్‌లో అదుపు తప్పిన జీపు

తిరుపతి క్రైమ్: తిరుమల రెండో ఘాట్ రోడ్లో ఓ వాహనం అదుపుతప్పి బోల్తా పడిన ఘటన శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. తిరుపతి నుంచి తిరుమలకు వెళ్తున్న ఓ జీపు బోల్తా కొట్టింది. ఇందులో నలుగురు భక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని హుటాహుటిన రుయా ఆస్పత్రికి తరలించారు.

విద్యార్థులను ఉపాధి వైపు పోత్సహించాలి


మాట్లాడుతున్న రాష్ట్ర కాలేజియేట్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ పోలా భాస్కర్

తిరుపతి సిటీ: విద్యార్థులను ఉపాధి వైపు ప్రోత్సహించేలా డిగ్రీ స్థాయిలో కొత్త కోర్సులు ప్రవేశపెట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని రాష్ట్ర కాలేజియేట్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ సూచించారు. ఆయన శుక్రవారం కోర్సుల రూపకల్పనపై తిరుపతి ఎస్వీయూ సెనేట్ హాల్‌లో ఉమ్మడి కర్నూలు, అనంతపురం జిల్లాల డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం డిగ్రీ కోర్సుల్లో ఆదరణలేని వాటికి చరమగీతం పాడి విద్యార్థులకు ఉపాధి కల్పించేలా కొత్త కోర్సులను ప్రవేశపెట్టాలని ఆదేశించారు. డిగ్రీ పట్టాతో విద్యార్థి పూర్తి స్థాయిలో ఉద్యోగం పొందేలా కోర్సుల రూపకల్పన ఉండాలన్నారు. 2024–25 విద్యా సంవత్సరం నుంచి జాబ్ ఓరియెంటెడ్ కోర్సులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఆయా జిల్లాల్లో స్థానిక అవసరాలకు తగ్గట్టు ఉద్యోగ అవకాశాలు లభించేలా కోర్సులు ఉండాలని సూచించారు. ప్రతి కోర్సులోనూ అకడమిక్, స్కిల్ డెవలప్‌మెంట్‌పై దృష్టి సారించి నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం కళాశాలలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న కోర్సులు, విద్యార్థుల సంఖ్య, మౌలిక వసతులపై ఆరా తీశారు.

11 మంది పోలీస్ అధికారుల ఉద్యోగ విరమణ


ఉద్యోగ విరమణ పొందిన వారితో ఏఎస్పీలు

తిరుపతి క్రైమ్: జిల్లాలో 11 మంది పోలీస్ అధికారులు శుక్రవారం ఉద్యోగ విరమణ పొందారు. వీరిని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఘనంగా సత్కరించారు. నగరంలో ఓ ప్రైవేట్ కన్వెన్షన్ హాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ ఉద్యోగ విరమణ పొందిన వారంతా ఇకపై ప్రశాంతమైన వాతావరణంలో సంతోషంగా గడపాలని కోరారు. ఎన్నో సంవత్సరాలు ప్రజల కోసం నిరంతరం కష్టపడి కుటుంబాలకు దూరంగా గడిపారని కొనియాడారు. ఉద్యోగ విరమణ పొందిన వారిలో డీఎస్పీలు నరసప్ప, కాటంరాజు, సీఐ చంద్రశేఖరొపెల్లి, ఏఎస్ఐలు దామోదర్‌రెడ్డి, కోదండయ్య, విజయ్‌కుమార్‌రాజు, ఏఆర్ ఎస్ఐ ఆనంద్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ హేమసుందర్ నాయుడు, వేణుగోపాల్, జగన్నాథం ఉన్నారు.

రెండేళ్ల డీ ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు

తిరుపతి ఎడ్యుకేషన్ : రెండేళ్ల కాలవ్యవధి కలిగిన డీ ఫార్మసీ కోర్సులో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని తిరుపతి కేటీ రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి తెలిపారు. ఈ కోర్సుకు ఇంటర్ బైపీసీ, ఎంపీసీ రెగ్యులర్, ఓపెన్ స్కూల్ ద్వారా ఇంటర్ పూర్తి చేసినవారు, అలాగే ఇంటర్ తత్సమాన కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఎపీఎస్‌బీటీఈటీ.ఇన్/ఫార్మసీ౨౨ అనే వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న తరువాత రిసిప్ట్ కాపీని డౌన్‌లోడ్ చేసుకుని 7036725872, 9908857585, 9966761446 నంబర్లకు వాట్సాప్‌లో పంపించాలని కోరారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు కౌన్సెలింగ్ చేపట్టే తేదీని ఫోన్ ద్వారా సమాచారం ఇస్తామని వెల్లడించారు.

యువకుడి ఆత్మహత్య


గణేష్ మృతదేహం వద్ద చిన్నబిడ్డతో రోదిస్తున్న భార్య సుకన్య

తడ: కుటుంబ కలహాల కారణంగా తీవ్ర మనస్తాపానికి గురైన యువకుడు గురువారం రాత్రి తాను పని చేసే మెకానిక్ షెడ్డులో ఉరి వేసుకుని తనువు చాలించాడు. ఎస్ఐ పీ.నరసింహారావు కథనం.. చెన్నై, బ్రాడ్‌వేలోని మన్నడి ప్రాంతానికి చెందిన గణేష్(21) రెండు రోజుల క్రితం పూడి గ్రామంలోని ఓ మెకానిక్ షెడ్డులో పనికి చేరాడు. రెండేళ్ల క్రితం అతనికి వివాహం కాగా ఓ కుమారుడు ఉన్నాడు. మద్యానికి బానిసైన ఇతను భార్యతో తరచూ గొడవ పడేవాడు. దీంతో భార్య అలిగి పుట్టింటికి వెళ్లడం, మళ్లీ రావడం జరుగుతూ ఉండేది. తడకు రాకముందు అదే విధంగా భార్యతో గొడవపడిన గణేష్ అలిగి పూడికి వచ్చి పనిలో చేరాడు. ఈ క్రమంలో పగలు పని ముగించుకుని, రాత్రి షాపులోనే బస చేస్తూ వచ్చాడు. ఒంటరి తనం వల్ల మనస్తాపానికి గురైన ఇతను రాత్రి సమయంలో షాపు పైన ఉన్న రేకుల సీలింగ్‌కి ఉరివేసుకుని మృతిచెందాడు. శుక్రవారం ఉదయం గమనించిన షాపు ఓనర్ పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు గతంలోనూ ఆత్మహత్యకు పాల్పడ్డట్టు పోలీసులు ప్రాథమిక విచారణలో తెలుసుకున్నారు. చిన్న బిడ్డతోసహా పూడికి వచ్చిన మృతుని భార్య సుకన్య గుండెలు బాదుకుంటూ బోరున విలపించడం అక్కడి వారిని కలచివేసింది. మృత దేహానికి సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం పూర్తిచేసి, బంధువులకు అప్పగించారు.

వడదెబ్బతో వృద్ధురాలి మృతి


పద్మావతమ్మ(ఫైల్)

చంద్రగిరి: వడదెబ్బ తగిలి వృద్ధురాలు మృతి చెందిన ఘటన చంద్రగిరి పంచాయతీ పరిధిలోని నాయీ బ్రాహ్మణ కాలనీలో చోటు చేసుకుంది. కాలనీకి చెందిన రాగూరు పద్మావతమ్మ(84) గురువారం ఎండ వేడిమికి తట్టుకోలేక తీవ్ర అస్వస్థతకు గురై తుది శ్వాస విడిచారని కుమారుడు రాగూరు చంద్రశేఖర్ ఆవేదన చెందారు. శుక్రవారం ఉదయం పద్మావతమ్మ అంత్యక్రియలు నిర్వహించారు. సీనియర్ జర్నలిస్టుగా సుదీర్ఘకాలం కొనసాగుతున్న రాగూరు చంద్రశేఖర్‌ను పలువురు పరామర్శించారు.

కౌంటింగ్ రోజున తిరుపతి రోడ్డుపై ట్రాఫిక్ మళ్లింపు

చిత్తూరు అర్బన్: ఈనెల 4వ తేదీన చిత్తూరు సమీపంలోని ఎస్వీ–సెట్ కళాశాల ప్రాంగణంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ నేపథ్యంలో రాకపోకలపై నిషేధం విధిస్తున్నట్లు చిత్తూరు ఎస్పీ మణికంఠ ఓ ప్రకటనలో తెలిపారు. చిత్తూరు నుంచి తిరుపతి, కడప, పీలేరు, హైదరాబాద్ వెళ్లే వాహనాలు రెడ్డిగుంట కూడలి నుంచి కాఫీడే మీదుగా ఆరు లైన్ల జాతీయ రహదారి మీదుగా ప్రయాణించాలన్నారు. తిరుత్తణి రోడ్డు వైపు నుంచి తిరుపతి వెళ్లేవాళ్లు జీడీ నెల్లూరు మీదుగా పుత్తూరు రోడ్డులో తిరుపతికి వెళ్లాలన్నారు. కడప, పీలేరు, తిరుపతి నుంచి చిత్తూరు వచ్చే వాహనాలు, వావిల్‌తోట, బండపల్లె, పూతలపట్టు నుంచి చిత్తూరు వచ్చే వాహనదారులు సైతం రంగంపేట మీదుగా ఆరు లైన్ల జాతీయ రహదారిపై వరిగపల్లె మీదుగా కాఫీడే కూడలి నుంచి చిత్తూరు నగరంలోకి చేరుకోవాలని తెలిపారు. తిరుపతి నుంచి చిత్తూరుకు పెనుమూరు మార్గంలో రాకపోకలు నిషేధించినట్లు పేర్కొన్నారు. రంగంపేట ఫ్లై ఓవర్ నుంచి మురకంబట్టు ఫ్లై ఓవర్ వరకు వాహనాల రాకపోకలు పూర్తిగా నిషేధమన్నారు. కౌంటింగ్ సిబ్బంది, అభ్యర్థులు, ఏజెంట్లను మాత్రమే ఎస్వీ–సెట్ వరకు అనుమతిస్తామన్నారు. జూన్ 4వ తేదీ ఉదయం 4 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ నిబంధనలు అమల్లో ఉంటాయని ఎస్పీ తెలిపారు.

ప్రేమ పేరుతో మోసం

చౌడేపల్లి: ప్రేమ పేరుతో మోసం చేసిన కేసులో నిందితుడు ఆనంద్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. దుర్గసముద్రం పంచాయతీ, బుటకపల్లెకు చెందిన వెంకటప్ప కుమారుడు ఆనంద్ ప్రేమ పేరుతో తనను మోసం చేసిన ఆనంద్‌పై యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దాదేపల్లె బస్ స్టాప్ వద్ద వేచి ఉన్న ఆనంద్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పుంగనూరు కోర్టు అతనికి రిమాండ్ విధించింది.

గంజాయి స్వాధీనం

– ఒకరి అరెస్ట్


స్వాధీనం చేసుకున్న గంజాయి, అరెస్ట్ చేసిన వ్యక్తితో సెబ్ అధికారులు

గూడూరు రూరల్: గూడూరు ఎస్ఈబీ పరిధిలో శుక్రవారం ఓ వ్యక్తి నుంచి గంజాయిని స్వాధీనం చేసుకుని, అతన్ని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ రమేష్ తెలిపారు. సెబ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ వివరాలను ఆయన వెల్లడించారు. గూడూరు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా తిరుగుతుండడాన్ని గుర్తించి అతన్ని విచారించగా.. అతని వద్ద ఉన్న సంచిలో ఏడు బ్రౌన్ కలర్ ప్లాస్టిక్ ప్యాకెట్లు ఉన్నాయని తెలిపారు. వాటిని పరిశీలించగా సుమారు 15 కిలోల గంజాయి ఉన్నట్టు తేలిందన్నారు. తెలంగాణ రాష్ట్రం, మహబూబనగర్, గద్వాల్ మండలం, బేరోలీ గ్రామానికి చెందిన హరిజన పాపన్న కొంత కాలంగా గంజాయిని రవాణా చేస్తున్నట్లు తెలిపాడన్నారు. దీంతో పాపన్నను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్టు సీఐ పేర్కొన్నారు. ఎస్ఈబీ ఎస్ఐ మోజెస్, హెడ్ కానిస్టేబుల్ కిరణ్‌సింగ్, సిబ్బంది వీఎస్ ప్రసాద్, క్రిష్ణయ్య, ఎస్కే గౌస్‌బాషా, ఆనందబాబు, రవి తదితరులు పాల్గొన్నారు.

ఆభరణాల చోరీలో మనవడే దొంగ


నిందితుడి అరెస్టును చూపుతున్న పోలీసులు

–3.84 లక్షల సొత్తు స్వాధీనం

కుప్పం: మండల పరిధిలోని ఊరునాయనపల్లెలో బంగారు నగల చోరీ కేసులో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ శ్రీనాథ్ తెలిపారు. శుక్రవారం వివరాలను ఆయన వెల్లడించారు. గ్రామానికి చెందిన శివమ్మ ఓంటరిగా ఉంటూ జీవనం సాగిస్తుంది. జీవనం కోసం బెంగళూరుకు వెళ్లి కూలీ పనులు చేసుకుని వారానికి, నెలకు ఒక్కసారి స్వగ్రామానికి వస్తోంది. రెండు రోజుల కిందట బెంగళూరు నుంచి స్వగ్రామానికి వచ్చిన సమయంలో ఇంటి తలుపు తాళాలు పగలు గొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉంది. సామగ్రి చిందర వందరగా ఉంది. బీరువాలోని రూ. 3.84 లక్షలు విలు చేసే బంగారు అభరణాలు చోరీ అయినట్లు గుర్తించి, పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి, అనుమానితులను విచారించారు. శివమ్మకు వరుసకు మనవడు అయిన కదిరివేల్‌ను పోలీసులు విచారించారు. తానే చోరీ చేసినట్లు అతను అంగీకరించాడు. అతన్ని అరెస్టు చేసి, చోరీ సొత్తును రికవరీ చేశారు. రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో సీఐ రమణ, ఎస్ఐ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.